DYNAMIC EDITION
వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మనసేత్రం
Follow
పేజీలు 2
శనివారం, నవంబరు 11, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## తెలంగాణ ప్రజలకు గవర్నర్ తమిళిసై దీపావళి శుభాకాంక్షలు



హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ ప్రజలకు గవర్నర్ తమిళిసై దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ దీపాల పండుగ చెడుపై ధర్మం సాధించిన విజయాన్ని సూచిస్తుందన్నారు. ఆధునిక కాలపు దురాచారాలను జయించి, శాంతి, సామరస్యం, మత సామరస్యంతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి మనకు స్ఫూర్తినిస్తాయని తాను ఖచ్చితంగా అనుకుంటున్నానని తెలిపారు. ఆత్మ నిర్భర్ భారత్ యొక్క నిజమైన స్ఫూర్తితో స్వదేశీ తయారీదారుల జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకురాలని చెప్పారు. ఈ పండుగకు స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయాలని అందరికీ గవర్నర్ విజ్ఞప్తి చేశారు. ఈ దీపావళి మన చుట్టూ ఉన్న ప్రజల జీవితాల్లో వెలుగులు, సంతోషం, శ్రేయస్సు, కొత్త ఆలోచనలను తేవాలని గవర్నర్ తమిళిసై కోరుకున్నారు.



## నటుడు చంద్రమోహన్ అస్తమయం

టాలీవుడ్ చిత్రపరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ సీనియర్ నటుడు చంద్రమోహన్ మృతి చెందారు. ప్రస్తుతం ఆయన వయసు 82. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రముఖులు చంద్రమోహన్ మృతికి సంతాపం తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇక ఆయన అంత్యక్రియలు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

1942 మే 23న కృష్ణా జిల్లా పమిడిముక్కలలో ఆయన జన్మించారు. చంద్రమోహన్ అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖర్. బాపట్లలో బీఎస్సీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఏలూరులో పనిచేశారు. సినిమాల్లో నటించాలనే ఉత్సాహంతో మద్రాసు వెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టారు. 1966లో 'రంగులరాట్నం' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేశారు. అప్పటి నుంచి నటుడిగా, సహాయనటుడిగా, హాస్య నటుడిగా, క్యారెక్టర్ యాక్టర్‌గా ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో నటించి మెప్పించారు. మొత్తం 932కిపైగా చిత్రాల్లో నటించారు. హీరోగా సుమారు 175 సినిమాలకు పైగా చేశారు. ప్రధానంగా కామెడీ పాత్రల ద్వారానే ఆయన విశేష ప్రేక్షకాదరణ పొందారు. ఆయన నటనకు గానూ రెండు ఫిల్మ్‌ఫేర్, ఆరు నంది అవార్డులు వరించాయి.

# కంచుకోటలో కాంగ్రెస్ బలమెంత?



(వాయిస్ టుడే- కరీంనగర్ )

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎట్టకేలకు కాంగ్రెస్ అభ్యర్థుల నియామకం పూర్తైంది. ఇతర పార్టీల అభ్యర్థులు గత నెల రోజులుగా ప్రచారాల్లో మునిగి తేలుతున్న తరుణంలో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన పూర్తి చేయకపోవడంతో, ఒకింత అసహనానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు మూడో జాబితాలో కీలకమైన నియోజకవర్గాలైన సిరిసిల్ల, కరీంనగర్ అభ్యర్థులుగా కేకే మహేందర్ రెడ్డి, పురుమళ్ల శ్రీనివాస్ లను ప్రకటించగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపిన పేరును కాంగ్రెస్ కైవసం చేసుకుంది. గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న కరీంనగర్ జిల్లాలో అపారమైన అనుభవం ఉన్న నాయకులైన తాటిపర్తి జీవన్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లు అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీపడుతుండడంతో పాటు తమ టీమ్ ను గెలిపించి తమ సత్తా చాటాలని కృషి చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు జిల్లాలో రాహుల్ గాంధీ పర్యటించి పాదయాత్రతో పాటు మేడిగడ్డను సందర్శించి పలువేదికలపై నుంచి కాంగ్రెస్ పార్టీ బలాబలాలను ప్రజలకు వివరించి ప్రచారం కొనసాగించారు.ప్రతి నియోజకవర్గంలో అభ్యర్థుల ఎంపిక అనేది బాగా చేశారనేది కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. అసంతృప్తులను బుజ్జగిస్తూ, అభ్యర్థులుగా ప్రకటించిన వారి బలబలాలను అసంతృప్తులకు వివరిస్తూ ఇతర పార్టీల్లోకి వలస వెళ్లకుండా కట్టడి చేయడంలో సీనియర్ నాయకులు పెద్దన్న పాత్ర పోషించారనడంలో అతిశయోక్తి లేదు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకోవడంతో పాటు, ఆరు గ్యారంటీల పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తూ, కర్నాటక రాష్ట్రంలో మాదిరిగా విజయకేతనం ఎగురవేయడానికి కాంగ్రెస్ టీం కదనరంగంలోకి దిగింది. దూకుడుగా ముందుకు సాగుతుండడంతో పాటు సీనియర్ల అండదండలు, రాహుల్ గాంధీ పర్యటనలు వెరసి కాంగ్రెస్ శ్రేణులు కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థుల బలాబలాలు ఇలా ఉన్నాయి. సర్పంచ్‌గా సుదీర్ఘ అనుభవంతో పాటు తన భార్య కరీంనగర్ జడ్పీటీసీగా చేస్తున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో అడుగుపెట్టిన పురుమళ్ల శ్రీనివాస్ కు రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉంది. సుమారు ముప్పై సంవత్సరాల రాజకీయాల్లో ప్రతిగ్రామంలో సత్సంబంధాలు ఉండడం, గంగుల కమలాకర్ తో విభేధాల దృష్ట్యా పురుమళ్ల శ్రీనివాస్ సరైన నాయకుడని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు.తెలుగుదేశం పార్టీలో విశేష అనుభవం ఉండి కాంగ్రెస్ పార్టీలో చేరిన




విజయరమణారావు గతంలో పెద్దపల్లి ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉంది. రేవంత్ రెడ్డితో టీడీపీ నుంచి నేరుగా సత్సంబంధాలున్న నాయకుడిగా పేరుగాంచిన విజయ రమణారావును రేవంత్ రెడ్డి ఆరునెలల క్రితమే ప్రకటించడం గమనార్హం.తండ్రి నుంచి వారసత్వ రాజకీయాలను అందిపుచ్చుకున్న శ్రీధర్ బాబుకు పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచి పలుశాఖల్లో మంత్రిగా పనిచేసిన అనుభవంతో పాటు నేరుగా రాహుల్ గాంధీతో మాట్లాడే స్థాయిలో ఉండడం, ఇతర నియోజకవర్గాల్లో ప్రచార స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న శ్రీధర్ బాబు మరోసారి విజయకేతనం ఎగురవేస్తారని కాంగ్రెస్ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జగిత్యాల నియోజకవర్గానికే పరిమితమైన జీవన్ రెడ్డి పలువురు ముఖ్యమంత్రుల హయాంలో పనిచేసిన అనుభవం ఉంది. మంత్రిగా, ఎమ్మెల్సీగా, సీఎల్పీ నేతగా అనుభవం ఉన్న జీవన్ రెడ్డి ఈసారి జగిత్యాల నియోజకవర్గం నుండి బరిలో నిలుస్తున్నారు. ఎన్నికల్లో పోటీచేయడం ఇదే చివరిసారి అంటూ ప్రజల్లోకి వెళ్తున్న జీవన్ కు విశేష ఆదరణ లభిస్తోంది.ఎన్ఎస్‌యూఐ నాయకుడి నుంచి ఎంపీ వరకు కాంగ్రెస్ పార్టీలో ఎదిగి తెలంగాణ రాష్ట్ర సాధనలో తన వంతు పాత్ర పోషించిన పొన్నం ప్రభాకర్ ఈసారి హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగారు. గౌడ సామాజిక వర్గం బలంగా ఉన్న హుస్నాబాద్ పై తనకు ఎంపీగా పనిచేస్తున్న తరుణంలో ఉన్న పట్టుతో ఈ సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ శాసనసభ్యులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డిని ప్రక్కన పెట్టి మరీ....పొన్నం పేరు ప్రకటించడంతో అందరి దృష్టి హుస్నాబాద్ పైనే ఉందని చెప్పవచ్చు.రామగుండం–రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, ధర్మపురి–అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రామగుండం, ధర్మపురి, కోరుట్ల–జువ్వాడి నర్సింగరావు, వేములవాడ–ఆదిశ్రీనివాస్, సిరిసిల్ల–కేకే మహేందర్ రెడ్డి, చొప్పదండి–మేడిపల్లి సత్యం, మానకొండూరు–కవ్వంపల్లి సత్యనారాయణలకు గతంలో పలు పార్టీలపై పోరాడిన అనభవంతో పాటు, ప్రజల్లో సానుభూతి, నియోజకవర్గ ప్రజలతో మమేకమై ఉండడంతో పాటు పలు అంశాలు కలిసివచ్చే పరిస్థితులు కనబడడంతో, ఒక్కో నియోజకవర్గం నుంచి వచ్చిన అభ్యర్థుల జాబితాను వడపోసి మరీ ఈ అభ్యర్థులను ప్రకటించినట్టుగా తెలుస్తోంది. ఒక్క హుజురాబాద్ నియోజకవర్గం నుంచి మాత్రమే కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ అనుభవం ఉన్న వొడితెల రాజేశ్వర్ రావు మనవడైన వొడితెల ప్రణవ్ బాబు పేరు ప్రకటించారు. నూతన ఉత్సాహంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఎవరిని విజయం వరిస్తుందో వేచిచూడాల్సిందే.



## 2 రోజులు ఓపిక పట్టండి.. మీ కష్టాలు తీర్చే బాధ్యత నాది

ఖమ్మం (వాయిస్ టుడే): మాట ఇస్తే నిలబడే కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మీరందరూ ఓటేసి గెలిపించాలని కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. శనివారం ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పొంగులేటి మాట్లాడుతూ... కేసీఆర్‌ను నమ్మి రెండు సార్లు ఓట్లేసి గెలిపిస్తే నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. మూడోసారి కూడా ముఖ్యమంత్రి కావాలని చంద్రశేఖర్ రావు తహతలాడుతున్నారన్నారు. ఈ సారి బీఆర్ఎస్ పార్టీని కట్టుబద్దలు చేయకపోతే కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసే ప్రబుద్ధుడు కేసీఆర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. అందుకే ప్రజలు ఆలోచించి ఓటేసి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకోవాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయని తెలిపారు. "ఇరవై రెండు రోజులు ఓపిక పట్టండి మీ కష్టాలు తీర్చే బాధ్యత నాది.. మీరందరూ హస్తం గుర్తుకు ఓటేసి మీ శ్రీనన్నను గెలిపించండి" అంటూ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వినతి చేశారు.



## కాంగ్రెస్ పార్టీకి పాల్వాయి స్రవంతి గుడ్ బై

హైదరాబాద్ (వాయిస్ టుడే): ఎన్నికలు చూస్తే 20 రోజులు కూడా లేవు. ఇంకా ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి జంపింగ్స్ అవుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి పాల్వాయి స్రవంతి గుడ్ బై చెప్పనున్నారన్న వార్త అలా వచ్చిందో లేదో.. ఆమె బీఆర్ఎస్‌లో చేరేందుకు మంత్రి జగదీష్‌రెడ్డిని కలిశారు. వీరిద్దరూ కలిసి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ ప్రెస్‌మీట్ అనంతరం మంత్రి కేటీఆర్ సమక్షంలో పాల్వాయి స్రవంతి గులాబీ కండువా కప్పుకోనున్నారు.

మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పాల్వాయి స్రవంతి పోటీ చేశారు. అప్పట్లో ఆమె మూడో స్థానంలో నిలిచారు. తాజాగా బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మునుగోడు టికెట్ ఇవ్వడం, పార్టీలో ప్రాధాన్యత తగ్గడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. నేడు లేదా రేపు కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్నారు. అయితే అంతకు ముందు కూడా పాల్వాయి స్రవంతి పార్టీ మారుతారంటూ ప్రచారం జరిగింది. తాను పార్టీ మారే ప్రసక్తే లేదని.. తనకు అసలు ఆ అవసరమే లేదని తెలిపారు. సీన్ కట్ చేస్తే తాజాగా ఆమె తాజాగా కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

## పనిచేసే ప్రభుత్వాన్నే ప్రజలు ఆశీర్వదిస్తారు: మంత్రి కేటీఆర్



హైదరాబాద్ (వాయిస్ టుడే): ప్రజలు పనిచేసే ప్రభుత్వాన్నే ఆశీర్వదిస్తారని మంత్రి కేటీఆర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో పార్ట్‌నర్స్ ఇన్ ప్రోగ్రెస్ ప్రోగ్రామ్‌లో మంత్రి పాల్గొన్నారు. జేఆర్‌సీ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం గణనీయంగా అభివృద్ధి చేసిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో మంచి పురోగతి సాధించామని చెప్పారు. తాము చేసిన అభివృద్ధి మీ కళ్ల ముందే కనిపిస్తోందన్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని మంత్రి చెప్పారు. ఈ మహానగరానికి చారిత్రకంగా గొప్ప పేరుందని అన్నారు. పాత హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందినదని నటుడు రజినీకాంత్ పొగిడిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. అభివృద్ధిలో హైదరాబాద్ న్యూయార్క్‌తో పోటీ పడుతోందని అన్నారు. గత పదేళ్లలో నగరంలో 36 ఫ్లైవోర్లు నిర్మించామని, 39 చెరువులను నవీకరించామని మంత్రి చెప్పారు. మిషన్ భగీరథ కార్యక్రమంతో హైదరాబాద్‌లో తాగునీటి సమస్య లేకుండా చేశామని తెలిపారు. అదేవిధంగా దేశంలో నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్, తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని గుర్తుచేశారు.

## కేసీఆర్ సీఎంగా ఉంటేనే అణగారిన వర్గాలకు న్యాయం: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ (వాయిస్ టుడే): కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటేనే అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని ఆమె కొనియాడారు. శనివారం నిజామాబాద్‌లో జరిగిన గోసంగి కులస్థుల ఆత్మీయ సమ్మేళనంలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దళితులకు ఇచ్చే అన్ని పథకాలకు గోసంగి కులస్థులకు వర్తింపజేస్తామని చెప్పారు. దళితబంధు కొందరికే ఇచ్చారనే ఆందోళన వద్దని, విడతల వారీగా అందరికీ వస్తుందని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. దేశంలోని మరే రాష్ట్రంలోనూ బీడీ కార్మికులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయడంలేదని, కేవలం తెలంగాణలో మాత్రమే బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్నామని అన్నారు. మోదీ అస్తవ్యస్త పాలనా విధానాలవల్ల నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. ప్రజల అభీష్టం మేరకే ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మానవతా దృక్పథంతో పనిచేస్తున్న ప్రభుత్వమని కవిత చెప్పారు. గాంధీభవన్‌లో రేవంత్ అనే గాడ్సే దూరిందని, అందుకే బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆమె విమర్శించారు. రేవంత్‌రెడ్డి, ఈటల రాజేందర్ తీరు పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ పాలనపై అక్కడి ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారని అన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం అయ్యి దక్షిణ భారతదేశంలో చరిత్ర సృష్టిస్తారని చెప్పారు.

# గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, యాపిల్, ఫేస్ బుక్ రావడం గర్వకారణం

హైదరాబాద్ (వాయిస్ టుడే): బాచుపల్లి, కే ఎల్ యునివర్సిటీ ఆపిల్ ఎక్సెలెన్స్ కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావుమాట్లాడారు. రాష్ట్రంలో వైద్య విద్య అభ్యసిస్తున్న వారిలో ఎక్కువగా మహిళలే ఉండటం గొప్ప విషయం. ఇక్కడ కూడా ఇంజినీరింగ్ చదువుతున్న వారిలో మహిళలే ఎక్కువ కనిపిస్తున్నారు. క్యాంపస్ ప్లేస్ మెంట్ లో కూడా మహిళలు సత్తా చాటుతున్నారు. అంతరిక్ష రంగంలో కూడా మహిళలు సత్తా చాటుతున్నారు. యువ ఓటర్లు మీరు. వాస్తవాలు గ్రహించాలి. సోషల్ మీడియా తప్పుడు ప్రచారం నమ్మొద్దు. నిజం గడప దాటకముందే, అబద్దం ఊరు దాటుతుంది అంటారు. అభివృద్ధిని చూసి నమ్మాలి. సీఎం వ్యవసాయం, ఐటీలో రాష్ట్రాన్ని నంబర్ 1 చేశారని అన్నారు.

నీతి ఆయోగ్, కేంద్ర ప్రభుత్వ సంస్థలు చెప్పిన వాస్తవాలు ఇవి. తెలంగాణ ధాన్యం ఉత్పత్తిలో నంబర్ 1, ఒకప్పుడు పంజాబ్ ఉండే. ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ నంబర్ 1. వరల్డ్ టాప్ 5 ఐటి కంపెనీలు హైదారాబాద్ నిలయం అయ్యింది. గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, యాపిల్, ఫేస్ బుక్ వంటివి ఇక్కడ ఉండటం మనకు గర్వకారణం. ఇతర ప్రాంతాల్లో పడిపోతుంటే, తెలంగాణ గ్రౌండ్ వాటర్ లెవెల్ ఎంతో పెరిగింది. గ్రీన్ కవర్ పెరుగుదలలో 7.7 శాతంతో తెలంగాణ నంబర్ 1. 300 కోట్ల మొక్కలు పెంచే తెలంగాణకు హరిత హారంకు సీఎం శ్రీకారం చుట్టారు. ఓట్ల కోసం చేసే పనులు కాదు, భవిష్యత్తు బతుకుల గురించి అలోచించి ఎన్నో కార్యక్రమాలు చేశారు. వైద్య విద్య



అందుబాటులో లేక రష్యా, ఉక్రెయిన్, చైనా వెళ్ళేవారు. 2014 లో 2850 ఎంబిబిఎస్ సీట్లు ఉంటే, ఇపుడు 10 వేల సీట్లు. ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభించాం. డబుల్ ఇంజిన్ రాష్ట్రాల్లో అభివృద్ధి లేదు. నీతి అయోగ్ అరోగ్య సూచిలో యూపి చివరి స్థానం. 24 గంటల నిరంతర కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. చెడుకు అట్రాక్ట్ కావద్దు. మన రాష్ట్రం ఎవరి చేతుల్లో ఉండాలో యువత ఆలోచించాలి. ఒకప్పుడు కైకిలి దొరకటం లేదు అనేవాళ్ళు. నేడు కైకిలోల్లు దొరకని పరిస్థితి. బీహార్, యూపీ, ఒరిస్సా, ఛత్తీస్ ఘడ్ నుండి ఇక్కడకు పని కోసం వస్తున్నారు. సీఎం కేసీఆర్ విప్లాత్మకమైన పాలసీల వల్ల ఈ మార్పు సాధ్యం అయ్యింది. రజినీ కాంత్ కు ఇక్కడి అభివృద్ధి అర్థం అయ్యింది. కానీ ఇక్కడి గజినీలకు అర్థం కావడం లేదు. యువత అభివృద్ధికి ఓటు వేయాలి. భవిష్యత్ బాగు కోరే ప్రభుత్వాన్ని ఎంపిక చేయాలని అన్నారు..



## పెన్‌పహాడ్‌లో మంత్రి జగదీష్ రెడ్డి ప్రచారం

సూర్యాపేట (వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఆ నాయకులకు పదవులు వస్తాయి. బీఆర్ఎస్ కు ఓటేస్తే ప్రజలకు పథకాలు వస్తాయని ' సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర సంపదను ఆసరా పెన్షన్లు, రైతు బంధు, భీమా అంటూ ఫలహారం మాదిరిగా పంచుతున్నారు.. రేపు నేను సీఎం అయితే ఎలారా నాయన" అంటూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనే నాయకుడు అనుచరులతో బాధ పడ్తున్నారట అని మంత్రి జగదీష్ ఎద్దేవ చేశారు. కులాలు, మతాలు పేరుతో దొంగలు వస్తున్నారని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. తనకు శత్రువులు లేరనీ.. రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే ఉన్నారని జగదీష్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పెన్ పహాడ్ మండలంలోని.. అనంతరం, నాగులపాటి అన్నారం, నారాయణగూడెం, నాగులపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు

## తొమ్మిది ఏళ్లలో 9వేల కోట్లతో అభివృద్ధి



శేరిలింగంపల్లి (వాయిస్ టుడే): తొమ్మిది ఏళ్లలో 9వేల కోట్లతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసినట్టు శేరిలింగంపల్లి టిఆర్ఎస్ అభ్యర్థి అరికెపూడి గాంధీ తెలిపారు. చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి తోపాటు కార్యకర్తలతో కలిసి శివాజీ నగర్ కాలనీ, తార నగర్, సిటీజన్ కాలనీ, వెంకటేశ్వర్ నగర్, ఇందిరా నగర్, తదితరు కాలనీలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 90 శాతం పనులు పూర్తి చేసామని మిగిలిన పనులను కూడా ఎన్నికల అనంతరం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కాలనీ చుట్టూ చెరువులు ఉండటం వల్ల వర్షాకాలంలో కాలనీలు నీటములకి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడే వారిని సమస్యలను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కారం చేసినట్లు ఆయన తెలిపారు. కేసీఆర్ మేనిఫెస్టో కుటుంబాని 15 లక్షల ఆరోగ్య భీమా సౌకర్యం నిరుపేద కుటుంబాలకు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. మేనిఫెస్టో ప్రకటించినవి కాకుండా మరిన్ని ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని గాంధీ వివరించారు. జరిగిన అభివృద్ధిని చూసిన ప్రజలు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు కారు గుర్తుకే ఓటేసి గెలిపిస్తామని చెప్పడం ఆనందంగా ఉందని గాంధీ అన్నారు.



## ముస్లిం మైనార్టీలకు న్యాయం చేసిన ప్రభుత్వం బీ.ఆర్.ఎస్...!

పెద్దపల్లి జిల్లా: నవంబర్. 10 (వాయిస్ టుడే) గోదావరిఖని: తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కెసిఆర్ ముస్లింలకు సముచిత స్తానం కల్పిస్తున్నరని రామగుండం ఎమ్మెల్యే, బీ.ఆర్.ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 41,49 డివిజన్ల పరిధిలోని అశోక్ నగర్, గాంధీనగర్ లో బీఆర్ఎస్ పార్టీ రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం ముస్లిం మైనార్టీలను కలుసుకున్నారు. ఆత్మీయంగా పేరుపేరునా పలకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కెసిఆర్ ముస్లింల విద్య కోసం మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసారని , రంజాన్ రోజున రంజాన్ తోఫాలను అందిస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం మతకల్లోలాలు లేని శాంతియుత పాలన సాగిస్తుందని ముస్లిం మైనారిటీల కోసం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని, కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రంలో శాంతియుత పాలనకు సహకరించాలని కోరారు. 41వ డివిజన్ లో కార్పొరేటర్ గాదం విజయ-నందు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. వేరువేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు గన్మకుల మహాలక్ష్మి-తిరుపతి, దుబాసి లలిత-మల్లేష్, బాలరాజ్ కుమార్, కో-ఆప్షన్ సభ్యులు రఫీక్, నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, జాహెద్ పాషా, మీర్ ఫయాజ్ అలీ, మునవర్, ముప్పిడి సత్యప్రసాద్, నూతి తిరుపతి, చల్ల రవీందర్ రెడ్డి, మాదాసు అరవింద్, తోకల రమేష్, సతీష్, కొంకటి లక్ష్మణ్, బొంకూరి మధు, మైస రాజేష్, వెంకటేష్, మైస మొగిలి, అల్లంకొండ రాజయ్య, జావిద్, హసన్, తాజ్, యాకూబ్, చోటు, షఫీఖాన్, అజ్జు, ఇమ్రాన్,గఫూర్ రియాజ్, వెంకటేష్, రవితేజ, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## ధరణి తప్పుల తడకని సీఎం కేసీఆర్ అఫిడవిట్‌తో తేలిపోయింది



హైదరాబాద్: కేసీఆర్ మానస పుత్రిక ధరణి తప్పుల తడకని ఆయన ఎన్నికల అఫిడవిట్ చూస్తేనే అర్థమైతుందని వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలా రెడ్డి విరచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. స్వయానా ముఖ్యమంత్రికి గుంట భూమి ఎక్కువొచ్చిందంటే ఇక సామాన్యుల సంగతి దేవుడెరుగన్నారు. ఉన్నోళ్లకు లేనట్టుగా, లేనోళ్లకు ఉన్నట్టుగా, సర్వే నెంబర్ల దాకా మార్చి చూపించే మాయాజాలమే ధరణి అంటూ వ్యాఖ్యలు చేశారు. గోటితో పోయే దాన్ని గొడ్డలి దాకా తెచ్చినట్లు రాష్ట్రంలో ఏ ఊరు చూసినా ధరణి గోసలే అని అన్నారు. తహశీల్దార్ దగ్గర నుంచి కోర్టుల దాకా ధరణి బాధలే అని చెప్పుకొచ్చారు. రైతుల భూములను గుంజుకొని, కోర్టుల చుట్టూ తిప్పుతూ, ధరణే దైర్యం అని చెప్పడానికి దొరకు ఆయన బందిపోట్లకు సిగ్గుండాలే అని ఆగ్రహం వ్యక్తం చేశారు.




## కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే గోసపడతాం: మంత్రి గంగుల

కరీంనగర్ (వాయిస్ టుడే): తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఇచ్చే హామీలకు మోసపోతే గోసపడతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ రూరల్ మండలంలోని చర్ల భుత్కుర్, తాహెర్ కొండాపూర్ గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ కరెంట్ కోతల వల్ల నాడు రైతులు అనేక కష్టాలు పడ్డారని, వేళాపాళా లేని కరెంటుతో పాముకాట్లకు గురై వందలాది మంది రైతులు మరణించారని పేర్కొన్నారు. హైదరాబాద్ రాష్ట్రం సంపదను దోచుకునేందుకు నాటి పాలకులు ధనిక రాష్ట్రాన్ని బలవంతంగా ఆంధ్ర లో కలిపారని, సమైక్య పాలనలో మన బొగ్గును దోచుకుని, గోదావరి జలాల ను తరలించుకున్నారని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనలో సాగు నీరు, కరెంట్ లేక అరిగోస పడ్డ రోజులు ఉండేవని గుర్తు చేశారు.

స్వయం పాలనలో సమస్యలు పరిష్కరించామని, కాళేశ్వరం జలాలతో తాగు సాగు నీటిని పరిష్కరించి మండుటెండల్లో చెరువులను మత్తడి దూకిస్తున్నామని అన్నారు. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో కరెంట్ కష్టాలు లేకుండా పోయాయని వివరించారు. తెలంగాణ వ్యతిరేకులైన మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి, షర్మిల, కేవీపీ తదితరులు బీజేపీ, కాంగ్రెస్ ముసుగులో హైదరాబాదులో అడ్డావేశారని, తెలంగాణలో చిచ్చు పెట్టమని పవన్ కళ్యాణ్ ను చంద్రబాబు పంపించారని అన్నారు. వీరంతా కలిసి కేసీఆర్‌ను ఓడించేందుకు గుడుపుఠాని చేస్తున్నారని మండిపడ్డారు.

ఎంపీగా గెలిచిన తర్వాత బండి సంజయ్ ఎప్పుడైనా కనిపించాడా అంటూ స్థానికులను ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా లేని తెలంగాణను ఊహించుకోలేమని భయంకరంగా ఉంటుందని పేర్కొన్నారు.



## కేసీఆర్... ఇదిగో నీ అఫిడవిట్.. ధరణిపై ఇప్పుడేమంటావ్?

కరీంనగర్ (వాయిస్ టుడే): ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ నేత బండి సంజయ్ మరోసారి విరుచుకుపడ్డారు. ధరణి పోర్టల్‌పై మాట్లాడుతూ... "ధరణి తప్పుల తడకని నువ్వే చెప్పుకున్నవ్ కదా. కేసీఆర్....ఇదిగో నీ అఫిడవిట్. నీ భూమి రికార్డుల్లోనే గుంట భూమిని ఎక్కువగా చూపింది. మరి ఇప్పుడేమంటావ్.. నువ్వే పెద్ద సన్నాసివని ఒప్పుకుంటావా. ధరణి పోర్టల్ రైతులను అరిగోస పెడుతుందని అంగీకరిస్తావా" అని ప్రశ్నించారు. తానతే సీఎం అవుతానని చెప్పనని తెలిపారు. ఎమ్మెల్యేల అభిప్రాయాల మేరకు పార్టీ అధిష్టానమే సీఎం అభ్యర్థిని ప్రకటిస్తుందని.. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తి సీఎం కావడం తథ్యం అని స్పష్టం చేశారు. హైకమాండ్ ఇదే విషయాన్ని ప్రకటించిందన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో ఇమేజ్ లేనేలేదన్నారు. బీఆర్ఎస్‌ను ఓడగొట్టేది బీజేపీయే అని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆర్ డబ్బు సంచులు పంపుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు.




## మున్నూరుకాపు కార్పోరేషన్ ఏర్పాటుకు హామీ పట్ల హర్షం

### ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి అండగా నిలవాలని నిర్ణయం

ఖమ్మం (వాయిస్ టుడే) : కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన బి.సి. డిక్లరేషన్ లో మున్నూరు కాపుల అభ్యున్నతి కోసం కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం పట్ల మున్నూరుకాపు సంఘం జిల్లా నాయకులు హర్షం వెలిబుచ్చారు..శనివారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో INTUC జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతా రాములు,రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కార్యదర్శి శెట్టి రంగరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు కల్లూరి సోమనాథం, పసుపులేటి దేవెందర్, తాళ్లూరి హన్మంతరావు, సంపెట సంపెట నరసింగరావు , గంగిశెట్టి శ్రీనివాసరావు , సముద్రాల శ్రీనివాస్ , సిరంశెట్టి వేణు తదితరులు మాట్లడారు.సోనియమ్మ ఇచ్చిన తెలంగాణ లో నేడు అన్ని వర్గాల ప్రజల ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు .. కాపులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ దశాబ్దాల అని పేర్కొన్నారు .. ఈ ఎన్నికల్లో రాష్ట్రం లోని మున్నూరుకాపులంతా కాంగ్రెస్ అండగా నిలవాలని కోరారు.. కార్పోరేషన్ ఏర్పాటును ప్రకటించిన కర్నాటక సీఎం సిద్దరామయ్య కు , ఈ నిర్ణయం తీసుకోవడం లో కీలకపాత్ర పోషించిన వి. హన్నంతరావు కి కృతజ్ఞతలు తెలిపారు..



## నా బలం.. బలగం (ఖనీ) ప్రజలు...!

గోదావరిఖని, నవంబర్ 11 (వాయిస్ టుడే) : స్వతంత్ర అభ్యర్థి గా రంగంలోకి దిగిన సోమారపు సత్యనారాయణ ఈ రోజు 6, 7 వ డివిజన్ల్ లో ఐబి కాలనీ, పవర్ హౌస్ కాలనీ ,సప్తగిరి కాలనీ లో ఇంటింటి ప్రచార కొనసాగించారు,వడ్లూరి రవి ,కొలపల్లి రవి,దాసరి రాజేశం,న్యాతరి రాయమల్లు, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమము నిర్వహించారు,ఈ బస్తి బాట కార్యక్రమంలో సోమారపు సత్యనారాయణ మాట్లాడుతూ రామగుండము లో ఎవరికి దక్కని ప్రేమ ,అభిమానాలు ఇక్కడి ప్రజలు నాకు ఇచ్చారు,నేను అధికారం లో ఉన్న లేకున్నా ఎప్పుడు నెను మీ వాడినెనని తెలిపారు ,ప్రజల మనసును గెలిచిన వాడే నిజమైన నాయకుడు అవుతాడు. అర్థబలం, అంగ బలం ఉన్నవాడు ఎప్పుడూ నాయకుడు కాలేడు అని, ప్రజల శ్రేయస్సు అభివృద్ధి ,కోరుకున్న వారిని ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారని . నాకు ఉన్నది కేవలం మీ బలం మీ అందరి బలగం అని చెప్పారు, నేను మున్సిపల్ ఛైర్మన్ గా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానంటే మీ అందరి సహకారంతో గెలిచి ఈ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దానని,ఇప్పుడు మళ్లీ నేను తిరిగి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ హవా,ఇంకొకరు మహాకూటమి అభ్యర్థి అయిన వారిని తిరస్కరించి నన్ను స్వతంత్ర అభ్యర్థి గా గెలిపోందించారు,ఇప్పుడు కూడా మళ్ళీ నేను స్వతంత్ర అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నాను,మీ అందరి సహకారంతో మళ్ళీ నన్ను గెలిపించుకోవలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమారపు అరుణ్ లావణ్య మాజీ మేయర్ రాజమణి,కుసుమ, కొకుల శ్రీనివాస్,రాసకట్ల సంపత్, బండారి సుధాకర్,మంజుల,పుష్ప,లావణ్య సింధు,సుజాత మరియు మాజీ కార్పొరేటర్లు పిడుగు కృష్ణ,కోదాటి ప్రవీణ్,వడ్లూరి రవి,రవి నాయక్,వీరన్న,పత్తి సంజీవ్, సుభాష్, నారాయణ రెడ్డి,బిక్షపతి దీటి వెంకటస్వామి,,చంద్రశేఖర్ గౌడ్,సంపంగి శ్రీనివాసు,కమల్ గౌడ,రాజుడేవిడ్,రాయ మల్లు,రమణారెడ్డి, అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.